పేదల కాలనీల్లో అభివృద్ధి పరుగులు

- ఏడో డివిజన్‌లో రూ. 5 కోట్లతో వసతుల కల్పన
- సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి పనులు చేపట్టిన వైనం
- కొండ ప్రాంతాల సమస్యలు పరిష్కారం
- సంక్షేమంతో పాటు, అభివృద్ధిలోనూ ముందంజ



కొండ ప్రాంతాల్లో రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణ దృశ్యం



లక్ష్మీపేటలో రుక్మిణీ రైస్‌మిల్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చిన దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల కాలనీల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. నగరాభివృద్ధిపై చిత్తశుద్ధి లేని గత ప్రభుత్వం స్థానిక సమస్యలను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యం అభివృద్ధిపై చూపలేదు. పర్యటనకు రావడం.. ఫొటో దిగి పేపర్‌లలో వేయించుకోవడం మినహా ఏ ఒక్క సమస్యను పట్టించుకోలేదు. దీంతో అనే సమస్యలు దశాబ్దంకు పైగా అపరిష్కృతంగా ఉన్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ఆందులో భాగంగా ఏడవ డివిజన్‌లోని కొండ ప్రాంతాలతో పాటు, పేదలు నివశించే కాలనీల్లో సైతం అభివృద్ధి వేగంగా జరిగింది. కేవలం రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కోసం రూ. 5 కోట్లు వెచ్చించింది. కొండ ప్రాంత ప్రజలకు తాము అండగా ఉన్నామంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ భరోసా ఇచ్చారు. ఏ సమస్య తన దృష్టికి తీసుకు వచ్చినా వెంటనే దాని పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

రోడ్లుకు ప్రాధాన్యత....

లబ్బీపేట రుక్మిణీ రైస్‌మిల్లు రోడ్డులో వెళ్లాలంటేనే ముదురుగు దర్శనమిచ్చేది. అలాంటిది ఏడాది కిందట రూ. 18 లక్షల అంచనాతో సీసీ రోడ్డు వేశారు. లక్ష్మీనగర్ ప్రధాన రహదారి సైతం రూ. 50 లక్షల అంచనాతో చేపట్టి పూర్తి చేశారు. మొగల్రాజపురం లోని సీఎస్ఐ చర్చిరోడ్డు, నెహ్రూనగర్‌లో పలు రోడ్లు వేశారు. రోడ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో డివిజన్‌లో శిథిలమైన రోడ్లన్నీ కొత్తవి వేయడంతో తళతళలాడుతున్నాయి. అన్నీ సీసీరోడ్లు వేయడంతో శాశ్వత పరిష్కారం లభించింది.

కొండపై దృష్టి....

మొగల్రాజపురం కొండప్రాంత వాసులు అనేక సమస్యలు ఎదుర్కొనేవారు. శిథిలమైన మెట్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, మంచినీరు అరకొరగా రావడం వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత పాలకులు ఆ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారంపై దృష్టి సారించారు. రూ.2.50 కోట్లు వెచ్చించి సదుపాయాలు కల్పించారు. సీఆర్ నగర్ వాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టి పూర్తిచేశారు. గుమ్మడితోట వద్ద కొండపక్కన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో మెట్లు మరమ్మతులు చేపట్టారు. ఇలా కొండ ప్రాంతాల్లో నివశించే ప్రజల అనేక సమస్యలను పరిష్కరించగలిగారు.



అనేక సమస్యలు పరిష్కరించాం

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొండ ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయి. ఈ ప్రభుత్వంలో వాటన్నింటినీ పరిష్కరించాం. మెట్లు మరమ్మతులు, మంచినీటి పైప్‌లైన్ వేయడంతో పాటు, యూజీడీ పైప్‌లైన్ కూడా ఏర్పాటు చేశాం. డివిజన్‌లో శిథిలమైన రోడ్లు సీసీ రోడ్లుగా మార్చాం. ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషితో అభివృద్ధి చేయగలిగాం.

-మెరకనపల్లి మాధురి, కార్పొరేటర్ 7వ డివిజన్



వసతులు కల్పించారు

రెండేళ్లలో మా ప్రాంతంలో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. గతంలో పైడు డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారడం, మ్యాన్ హోల్స్ వద్ద గోతులు ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వాటికి మరమ్మతులు చేశారు. అంతేకాకుండా డివిజన్‌లో చాలా ప్రాంతాల్లో రోడ్లు వేశారు. కొండ ప్రాంతాల్లో మెట్లు, యూజీడీ, మంచినీటి పైప్‌లైన్ పనులు చేశారు. ప్రజలకు అనేక వసతులు కల్పించారు.

-రెంటపల్లి కొండ, బాడవపేట

వీఎంసీ బడ్జెట్‌పై కమిషనర్ సమీక్ష



బడ్జెట్‌పై సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాల్గొన్న అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా, నగరాభివృద్ధే లక్ష్యంగా 2024–25 ఆర్థిక ఏడాదికి వీఎంసీ బడ్జెట్ ఉండాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో అన్ని శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024–2025 సంవత్సరపు అంచనాలు అభివృద్ధికి ప్రతీకగా ఉండాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో కేటాయించిన బడ్జెట్ రాబోవు కాలానికి అవసరమైన బడ్జెట్ గురించి చర్చించారు. అధికారులకు నగరాభివృద్ధిపై తగు సూచనలు చేసి, ప్రజా ప్రయోజనాల గురించి అవసరమయ్యే పనులకు తగిన బడ్జెట్ ప్రతిపాదనలతో మరోసారి సమీక్ష సమావేశంలో నివేదికను తనకు అందించాలని ఆదేశించారు.

రూ.4.10 లక్షల స్వాధీనం

ఉంగుటూరు: ఎటువంటి ఆధారాలు లేని రూ.4.10 లక్షల నగదును తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య నేతృత్వంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పిడుగురాళ్ల నుంచి రావులపాలెం వెళ్తున్న కారులో రూ.4,10,000 నగదును గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో స్టేషన్‌కు తరలించి నగదును స్వాధీన పరచుకుని సీజ్ చేశారు.

క్లుప్తంగా

జీవనోపాధికి బండ్లు పంపిణీ



గుణదల (విజయవాడ తూర్పు): పేద ప్రజలకు సేవ చేసేందుకు ఏర్పాటు చేసిన దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆ ట్రస్ట్ వైస్ చైర్మన్ దేవినేని సుధీర అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని పేదలకు టిఫిన్ బండ్లు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. అనేక మంది పేదలకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, బడ్డీ కొట్లు, ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో నలుగురికి రూ.90 వేలు ఖరీదు చేసే రెండు తోపుడు బండ్లు, రెండు టిఫిన్ బండ్లు అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కోఆప్షన్ సభ్యులు మునునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాగూర్‌కు నివాళి



గుణదల: గుణదలలోని నాయీ బ్రాహ్మణ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ జయంతి గురువారం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. కనకరావుతో పాటు తదితరులు పాల్గొని ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకరావు మాట్లాడుతూ ఠాగూర్ చేసిన కృషి, త్యాగాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి అత్యున్నత పురస్కారం భారతరత్న ఇచ్చి గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. నివాళులర్పించిన వారిలో బీసీ నాయకులు మేకా వెంకటేశ్వరరావు, ధనవంత్రి, సత్యనారాయణ, బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు, సుధాకర్, తెన్నేటి సోము శేఖర్ తదితరులున్నారు.

స్టెల్లాలో జాతీయ ఓటరు దినోత్సవం



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్టెల్లా కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రేఖ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన అత్యంత ప్రముఖమైన సాధనమే ఓటు హక్కు అని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ వల్లూరి ప్రసాద్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం చేసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ లేన క్వడ్రస్, అధ్యాపకులు మృదుల, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ శైలజ, సబ్ లెఫ్టినెంట్ స్వప్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫేషియల్ పెయింట్స్



గుణదల(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా లయోల కాలేజీలో గురువారం నిర్వహించిన సోషల్ హార్మోని (ఫేషియల్ పెయింట్) ఆకట్టుకుంది. బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సోషల్ యూనిటీ ఆఫ్ కలర్స్, మత సామరస్యం, చిన్నారి బాధ, వార్ అండ్ హ్యూమానిటీ, 75వ గణతంత్ర దినోత్సవ జాతీయ జెండా, మూడు మతాల సూచిక, మహాత్మాగాంధీ గొప్పదనం, శాంతి–సౌభ్రాతృత్వం–సమానత్వం, యోగా (ఆరోగ్యమే మహాభాగ్యం), పాజిటివిటీ, ద జాయ్ ఆఫ్ ఇండిపెండెన్స్ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ), మతాల ఐకమత్యం, శాంతికపోతం పెయింట్స్‌ను ముఖానికి వేసుకుని ప్రదర్శన ఇచ్చారు. విజువల్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి ఫాదర్ రాయప్ప, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, స్టూడెంట్స్ యాక్టివిటీ డీన్ శుభ, అధ్యాపకులు శ్రీధర్, జి.కార్తీక్, పి.లలిత విద్యార్థులను అభినందించారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు

తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



డివిజన్ నాయకులతో అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు. అలానే తూర్పులో వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగుర వేస్తుందని పేర్కొన్నారు. ఏడో డివిజన్ పరిధిలోని గుమ్మడితోట ప్రాంతంలో దేవినేని అవినాష్ గురువారం పర్యటించారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచిన తర్వాత చేపట్టే పనుల గురించి డివిజన్ వాసులకు తెలియజేశారు. అవినాష్ మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయని చెప్పారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తమకు అందుబాటులో ఉంటూ తమ సమస్యలను పరిష్కరిస్తున్నారని స్థానికులు చెప్పడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే, నగర మేయర్, స్థానిక కార్పొరేటర్ ఆ పార్టీకి చెందిన వారే ఉన్నా ఈ డివిజన్‌లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీవి కేవలం షో రాజకీయాలేనని విమర్శించారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై తాము ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పొందుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ అసత్య ప్రచారాలతో నీచ రాజకీయాలకు పాల్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. టీడీపీ ఎన్ని విష ప్రచారాలు చేసినా ప్రజలకు వాస్తవాలు తెలుసు అని అన్నారు. కార్పొరేటర్ మాధురితో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణలంక సీఐగా మురళీకృష్ణ




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎ.మురళీకృష్ణ, మోహనరెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఎ.మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎం.వి.దుర్గారావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఎ.మురళీకృష్ణ గతంలో అడ్డతీగల సర్కిల్ ఏజెన్సీ సీఐగా, కాకినాడ రూరల్ సీఐగా పని చేశారు. ప్రస్తుతం సర్పవరం సీఐగా పనిచేస్తూ కృష్ణలంక పీఎస్‌కు సీఐగా బదిలీపై వచ్చారు. కృష్ణలంక సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటానని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తానన్నారు.

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ పోలీస్ కమిషనర్ రేట్ పరిధిలోని పటమట సీఐగా డీకేఎన్ మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 22న కమిషనర్‌రేట్‌లోని పలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయగా పటమటలో విధులు నిర్వహిస్తున్న దాసరి కాశీవిశ్వనాథ్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. మైలవరం సీఐగా పనిచేస్తున్న డీకేఎన్ మోహన్‌రెడ్డిని పటమటకు బదిలీ చేశారు. ఈ మేరకు కాశీవిశ్వనాథ్ గురువారం తన విధుల నుంచి రిలీవ్‌కాగా, మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వెంకట సత్యనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆడుదాం ఆంధ్రా విజయవాడ నియోజకవర్గ స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. నియోజకవర్గంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, సిద్ధార్థ మహిళా కళాశాల, డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలలో క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. పోటీలలో విజేతలకు కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం సాయంత్రం జరిగిన సభలో ముఖ్య అతిథులుగా డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. క్రికెట్ క్రీడలో పురుషుల విభాగంలో రాణిగారితోట సెక్రటరియేట్ (21073088) టీంకు, మహిళల విభాగంలో సిద్ధార్థనగర్ సెక్రటరియేట్(21073272) టీంకు మొదటి బహుమతి అందజేశారు. అలాగే వాలీబాల్ క్రీడలో పురుషుల విభాగంలో అంబేద్కర్‌నగర్ సెక్రటరియేట్ (21073061) టీంకు, మహిళల విభాగంలో శ్రీనివాసనగర్ సెక్రటరియేట్ (21073008) టీంకు మొదటి బహుమతి, కబడ్డీ క్రీడలో పురుషుల విభాగంలో రెవిన్యూకాలనీ సెక్రటరియేట్ (21073062) టీంకు, మహిళల విభాగంలో సున్నపు బట్టీలు–శ్రీనగరాజపురం సెక్రటరియేట్(21073018) టీంకు మొదటి బహుమతి, ఖోఖో క్రీడలో పురుషుల విభాగంలో కృష్ణవేణి స్కూల్ రోడ్డు సెక్రటరియేట్(21073283) టీంకు, మహిళల విభాగంలో నాగేంద్రనగర్ సెక్రటరియేట్(21073073) టీంకు మొదటి బహుమతి, బాడ్మింటన్ క్రీడలో పురుషుల విభాగంలో భారతీనగర్ సెక్రటరియేట్ (21073007) టీంకు, మహిళల విభాగంలో మెట్లబజార్ ఏరియా సెక్రటరియేట్(21073109) టీంకు మొదటి బహుమతి అందజేశారు. ఆయా క్రీడాంశాల్లో పురుషుల, మహిళల విభాగాల్లో రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు పుప్పాల కుమారి, చాటివర్తి కొండారెడ్డి, వీఎంసీ జోనల్ కమిషనర్ ఎం.కృష్ణ వీఎంసీ అధికారులు అరుణ, వసీంబేగ్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

28న చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరానికి చెందిన సీనియర్ చిత్రకారుడు, చిత్రకళా తపస్వి వేముల కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా ఈ నెల 28వ తేదీన గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో గురువారం చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కామేశ్వరరావు గీసిన చిత్ర కళాప్రదర్శన, 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు చిత్రకళా ప్రదర్శనను యువజన సంక్షేమ శాఖాధికారి యు.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, సంధ్యారాణి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడస్పోర్ట్స్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా, రెడ్‌సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరి జంక్షన్ వరకు కేవలం ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తామని, ఇతర వాహనాలను అనుమతించమని స్పష్టం చేశారు.

వాహనాల దారి మళ్లింపు ఇలా..

ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి బెంజిసర్కిల్‌కు స్వర్ణప్యాలెస్, దీప్తిసెంటర్, పుష్పాహోటల్, జమ్మిచెట్టుసెంటర్, సిద్ధార్థ జంక్షన్ మీదుగా ఒక మార్గంగా, బందరు లాకులు, రాఘవయ్యపార్క్, అమెరికన్ ఆసుపత్రి, నేతాజీబ్రిడ్జి, స్క్యూబ్రిడ్జి మీదుగా మరో మార్గంగా రాకపోకలు సాగించాలి. ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు, ఐదో నెంబర్ రూట్ మీదుగా మాత్రమే రాకపోకలు సాగించాలి.

పార్కింగ్ ప్రదేశాలు..

ఏఏ పాస్‌లు కలిగిన వారు మూడో నెంబర్ గేట్ నుంచి, ఏ1 పాస్‌లు కలిగిన వారు నాల్గో నెంబర్ గేటు నుంచి, బీ1 పాస్‌లు కలిగిన వారు ఆరో నెంబర్ గేటు నుంచి, ఐఏఎస్ అధికారులు, మీడియా ప్రతినిధులు రెండో నెంబర్ గేటు ద్వారా స్టేడియంలోకి ప్రవేశించి నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. నున్న, సింగ్‌నగర్, సత్యనారాయణపురం, మాచవరం వైపు నుంచి వచ్చే విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు బెంజిసర్కిల్ వద్దనున్న బిషప్ అజరయ్య స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి. పటమట వైపు నుంచి విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు.. విద్యార్థులను స్టేడియం వద్ద దింపి బస్సులను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి.

జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ ఖాయం



సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని

- విజయవాడ నగరం వైఎస్సార్ సీపీ కంచుకోట కానుంది
- విజయవాడ ఎంపీ కేశినేని నాని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయనుందని, విజయవాడ నగరం వైఎస్సార్‌సీపీ కంచుకోటగా అవతరించనుందని విజయవాడ ఎంపీ కేశినేని నాని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో గురువారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎండీ రుహుల్లాతో కలిసి ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గత ఎన్నికల్లో 25 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా మల్లాది విష్ణు విజయం సాధించారని, కానీ ఈసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస ఏకంగా 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తీరుతారన్నారు. చంద్రబాబుది అంతా స్వార్థ రాజకీయమేనని, తరతరాలు తామే ఏలాలి, తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలనే తప్ప రాష్ట్ర అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోరని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడంతో పాటు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మాట ఇస్తే మోసం చేసే వ్యక్తి చంద్రబాబు అని, మాట ఇస్తే నిలబెట్టుకునే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో భూకబ్జా దారుడు, బ్లాక్ మెయిలర్, స్వాతంత్ర్య సమర యోధుల భూములను సైతం కాజేసిన బొండా ఉమా లాంటి వ్యక్తికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో గెలిచే తొలి సీటు సెంట్రలే : మల్లాది విష్ణు

జిల్లాలో వైఎస్సార్ సీపీ గెలిచే మొట్టమొదటి సీటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గమేనని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వెలంపల్లి శ్రీనివాస్ గెలుపునకు తన పూర్తి సహకారం ఉంటుందని, జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు బూపూడి ప్రభాకర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసీఫ్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ తదితరులు హాజరయ్యారు.

నేడు మెగా హెల్త్ క్యాంపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తినగర్ రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్‌లో శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ టీపీ మురళీకృష్ణ తెలిపారు. ఉచిత కన్సల్టేషన్‌తో పాటు మధుమేహం (ఆర్‌బీఎస్), కొలెస్ట్రాల్, థైరాయిడ్ (టీఎస్‌హెచ్), బ్లడ్ యూరియా, కిడ్నీ పరీక్ష, లివర్ పరీక్ష, ఇసీజీ వంటివి ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో త్రినయన ఐ కేర్‌కు చెందిన డాక్టర్ సి.త్రివేణి పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. రాయితీపై టోటల్ బాడీ చెకప్‌కు సంబంధించి ప్రత్యేక ప్యాకేజీ పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. కళ్లజోళ్లు 50 శాతం వరకూ రాయితీ ఇస్తామన్నారు.

- పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డుకు గాయాలు కావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడు హనుమాన్‌నగర్‌కు చెందిన కూనపరెడ్డి నాగనాంచారయ్య ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. అతను బైక్‌పై కంకిపాడు నుంచి కానూరు వైపునకు వస్తుండగా ప్రమాదం జరిగింది.